విష జ్వరాలకు అడ్డుకట్ట వేయాలి: ఎమ్మెల్యే


బల్దియా కమిషనర్ ఆమ్రపాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ప్రబలుతున్న విష జ్వరాలకు అడ్డుకట్ట వేయాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన కార్వాన్ నియోజకవర్గంలో కుంటుపడిన పారిశుద్ధ్య పనులు, కానరాని ఎంటమాలజీ సిబ్బంది, నత్తనడక సాగుతున్న అభివృద్ధి పనుల విషయాలపై చర్చించారు. ఎంటమాలజీ, పారిశుద్ధ్య విభాగాలు సరిగా పని చేయకపోవడంతో నియోజకవర్గంలో విష జ్వరాలు పెరిగిపోయాయన్నారు. దోమల నియంత్రణలో ఎంటమాలజీ విభాగం చిత్తశుద్ధితో పని చేయడం లేదని ఏ యూనిట్ ఎక్కడ పని చేస్తుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. పారిశుధ్య విభాగాన్ని మరింత పటిష్టం చేయాలని ఆయన కమిషనర్‌ను కోరారు. నియోజకవర్గంలోని చెరువులు, నాలాలు దోమల ఉత్పత్తికి నిలయాలుగా మారాయని శాతం చెరువుతో పాటు బుల్కాపూర్ నాలా గోల్కొండ కోట కందకాలలో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా కమిషనర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

18న తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం కార్యవర్గం ఎన్నికలు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్ మేరు

గౌలిపురా: తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం కార్యవర్గం ఎన్నికలు ఈనెల 18న జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న కీర్తి రాజ్‌గోపాల్, ప్రధాన కార్యదర్శిగా పోటీ చేస్తున్న దీకొండ నర్సింగ్ రావు ప్యానల్‌కు చెందిన సభ్యులను భారీ మెజార్టీతో గెలిపించాలని సంఘం ఉపాధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న కె.వెంకటేశ్ మేరు రాష్ట్రంలోని మేరు కులస్తులను కోరారు. మంగళవారం ఉప్పుగూడలో మేరు సంఘం హైదరాబాద్ జోన్-1 కమిటీ అధ్యక్షుడు జి.శివ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మేరు సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న రాజ్‌గోపాల్ ప్యానల్‌కు మద్దతు ప్రకటిస్తూ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో రాజ్‌గోపాల్ ప్యానల్‌కు చెందిన సభ్యులకు మద్దతుగా రూపొందించిన వాల్‌పోస్టర్‌ను వెంకటేశ్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎన్నికల్లో కార్యదర్శిగా పోటీ చేస్తున్న శ్రీపతి సూరజ్, మేరు యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సంజీవ్, జోన్-1 మాజీ అధ్యక్షుడు కె.సురేశ్ బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన నిజాం కళాశాల విద్యార్థులు

గన్‌ఫౌండ్రీ: డిగ్రీ విద్యార్థులకు పూర్తిస్థాయి హాస్టల్‌ను కేటాయించాలని కోరుతూ మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి నిజాం కళాశాల విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. నిజాం కళాశాల పూర్వ విద్యార్థి, 2022లో హాస్టల్ కోసం విద్యార్థినులు ఆందోళన చేయగా నాడు భట్టి విక్రమార్క మద్దతుగా ఇచ్చినట్లు విద్యార్థులు గుర్తుచేశారు. నిజాం కళాశాల విద్యార్థుల వసతి గృహం సమస్య తనకు తెలుసు అని డిగ్రీ విద్యార్థినులకు పూర్తి న్యాయం చేస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.



రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

శాలిబండ: ప్రభుత్వ కులీ కుతుబ్ షా పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరి తెలిపారు. కళాశాల నోటీసు బోర్డులో ఈ నెల 8న ఖాళీలను ప్రదర్శించనున్నామన్నారు. అనంతరం అదే రోజు నుంచి అడ్మిషన్ల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ఈ నెల 11న దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ అన్నారు. 12న స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా స్పాట్ అడ్మిషన్ కోసం అభ్యర్థులు తమ వివరాలను అప్‌లోడ్ చేయాలని..ఆన్‌లైన్ ద్వారా ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు చివరి తేదీన్నారు. స్పాట్ అడ్మిషన్ల కింద మిగిలిపోయిన ఖాళీలను భర్తీ చేయడంతో పాటు 50 శాతం సీట్లను ప్రైవేటు మైనార్టీ సంస్థల యజమాన్యంతో భర్తీ చేస్తామన్నారు.

12 నుంచి 'ఘర్ ఘర్ తిరంగా' చేపట్టాలి


మాట్లాడుతున్న కన్వీనర్ గోవర్ధన్, జాయింట్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్

జియాగూడ: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఆకుల గోవర్ధన్ అన్నారు. సోమవారం రాత్రి జియాగూడలోని 2జే బస్టాండ్, ఎల్లమ్మ టెంపుల్ ప్రాంతంలో ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమ సమావేశం డివిజన్ అధ్యక్షుడు జె.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటైంది. ఈ సందర్భంగా నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ బి.శివకుమార్ యాదవ్ మాట్లాడుతూ..ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జియాగూడలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయడంతో పాటు మహాత్ముల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకుడు దర్పల్లి నర్సిమ్ములు, యువ మోర్చా, శక్తిమోర్చా, మహిళామోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్టీలకు అన్యాయం చేసే వ్యాఖ్యలు మానుకోవాలి


మాట్లాడుతున్న రవీంద్రనాయక్ తదితరులు

సుల్తాన్‌బజార్: బీజేపీ నాయకుడు సోయం బాబురావు ఎస్టీ రిజర్వేషన్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ అన్నారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎస్ఎస్ఎలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..లంబాడీలను ఎస్టీల నుంచి తీసివేయాలని తన సొంత లబ్ధికోసం బాబురావు లంబాడీలకు నష్టం కలిగించే విధంగా మాట్లాడుతున్నారని ఆయనపై బీజేపీ నాయకత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చిన నేపథ్యంలో ఏబీసీడీ వర్గీకరణలో లంబాడీలను తీసివేసి వర్గీకరణ చేయాలని సోయం చేసిన వ్యాఖ్యలు లంబాడీలకు రాజ్యాంగపరంగా ఎంతో నష్టాన్ని కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ నాయక్, మాణిక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ శోభ


శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు శ్రీనివాస శర్మ తదితరులు


పూజల్లో కార్పొరేటర్ సున్నం రాజమోహన్, సేవా సమితి అధ్యక్షుడు కాశిబుగ్గ బాబన్న

నాంపల్లి: ఆలయాల్లో శ్రావణమాస శోభ సంతరించుకుంది. మొన్నటి వరకు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని బోనాల పండగతో కళకళలాడిన ఆలయాలు ఇప్పుడు శ్రావణ మాస ఆరంభంతో భక్తుల సందడి పెరిగింది. ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలో వెలసిన హనుమాన్ మందిర ప్రాంగణంలో కొలువుదీరిన శివాలయంలో శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈఓ శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ సమక్షంలో నిత్యపూజాదికాలు కొనసాగుతున్నాయి.

జియాగూడలో..

జియాగూడ: కాశీబుగ్గ దేవస్థానం, మురళీ మనోహరస్వామి ఆలయాలను దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని కార్పొరేటర్ సున్నం రాజమోహన్ అన్నారు. మంగళవారం కాశీబుగ్గ దేవస్థానం సేవా సమితి అధ్యక్షుడు కాశీబుగ్గ బాబన్న ఆధ్వర్యంలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సున్నం రాజమోహన్ మాట్లాడుతూ..ప్రతి యేటా శ్రావణ మాసంలో కాశీబుగ్గ దేవస్థానాన్ని దర్శించుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఓం సింగ్, అనిల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న కేఆర్.రాజ్‌కుమార్ తదితరులు

నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు మరువలేనివని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన జయశంకర్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. తొలిదశ ఉద్యమం నుంచి మలిదశ పోరాటం వరకు ఆయన చేసిన భావజాలవ్యాప్తి, చూపించిన స్ఫూర్తి అందరికి ఆదర్శమన్నారు. రాష్ట్ర మినిమమ్ వేజెస్ అడ్వైజర్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, డైరెక్టర్ (పీఅండ్‌పీ) జి.వెంకటేశ్వరరెడ్డి, జీఎం (కో ఆర్డినేషన్) జి.దేవేందర్, జీఎం (పీఅండ్‌పీ) సాయిబాబు, జీఎం ఎన్.వి.రాజశేఖర్ రావు పాల్గొన్నారు.

జేఎన్ఏఎఫ్ఏయూలో ..

విజయనగర్‌కాలనీ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ సారు పాత్ర చిరస్మరణీయమని జేఎన్ఏఎఫ్ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.మధుకర్ పేర్కొన్నారు. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన ప్రొ. జయశంకర్ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రొ. కొడాలి సుందర్‌కుమార్, ప్రొ. ఎస్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.విష్ణువర్ధన్, ప్రొ. ఎంఎల్ ఆనంద్‌రావు, జె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


జేఎన్ఏఎఫ్ఏయూలో..

రవీంద్రభారతిలో..

గన్‌ఫౌండ్రీ: జయశంకర్ జయంతి వేడుకలను మంగళవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణిప్రసాద్ మాట్లాడుతూ.. జయశంకర్ గొప్పతనం రాబోయే తరానికి స్ఫూర్తిమార్గం కావాలని కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి రూపొందించిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య, ఆ చల్లని సముద్ర గర్భం గీతాల ప్రత్యేక కేలండర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ పుంజాల అలేఖ్య, పర్యాటక శాఖ సంచాలకులు త్రిపాఠి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సాంస్కృతిక శాఖ సీనియర్ ఉద్యోగిని హేమలతారెడ్డి పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న వాణిప్రసాద్ తదితరులు

జయశంర్‌కు ఘన నివాళి..

యాకుత్‌పురా: జయశంర్ జయంతి సందర్భంగా మంగళవారం తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆయన విగ్రహానికి నివాళుల్పరించారు. ఆయనతో పాటు న్యాయవాదులు రవీందర్ రావు, అరుణ్‌కుమార్, రవికుమార్, శివానంద్ పాల్గొన్నారు.

ఛత్రినాకలో..

చాంద్రాయణగుట్ట: జయశంకర్ జయంతి సందర్భంగా ఛత్రినాక పోలీసులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు శ్రీకాంత్, త్రిమూర్తులు, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ సేవలు ఎనలేనివి..

గన్‌ఫౌండ్రీ: జయశంకర్ సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం గన్‌ఫౌండ్రీలోని డీఈఓ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యాశాఖ అధికారులు శ్రీనివాసరెడ్డి, చిరంజీవి, టీఎస్టీఓస్ పాఠశాల విద్యాశాఖ విభాగం నగర అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్ డేవిడ్, ఎం.రవి, జయంతిరెడ్డి పాల్గొన్నారు.


జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బలరామ్


నివాళులర్పిస్తున్న ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

గాయత్రీనగర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జీవన్‌సింగ్



గోల్కొండ: గాయత్రీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాంగ్రెస్ నాయకుడు టి.జీవన్‌సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాలనీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జీవన్ సింగ్‌ను సమ్మతితో అధ్యక్షుడిగా ఎన్నుకుంది. ఈ సందర్భంగా జీవన్‌సింగ్ మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్న అసోసియేషన్‌కు తాను ఎంతో రుణపడి ఉంటానన్నారు. కాలనీ ప్రధాన కార్యదర్శిగా వేణుయాదవ్, కోశాధికారిగా రాజేందర్‌ను ఎన్నుకున్నారు.

బాలుడి అదృశ్యం


కౌశిక్

అబిడ్స్: మంగళ్‌హాట్ పరిధిలోని కిస్తీచమాన్ ప్రాంతంలో ఐదేళ్ల బాలుడు అదృశ్యమయ్యాడు. ఇంటి ముందు ఆడుకుంటున్న కౌశిక్ (5) అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యులు మంగళ్‌హాట్ పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ అస్లాం తెలిపిన వివరాల ప్రకారం..కిస్తీచమాన్‌లో నివాసం ఉండే దుర్వేకమాల్ కుమారుడు కౌశిక్ సోమవారం ఆడుకుంటూ కొద్దిసేపటి తర్వాత కనిపించలేదు. వెంటనే పరిసర ప్రాంతాల్లో బాలుడి ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తికి జైలు శిక్ష


సయ్యద్ జహీద్

గౌలిపురా: మరణాయుధంతో సంచరిస్తూ చోరీకి యత్నించిన కేసులో ఓ వ్యక్తికి నాంపల్లిలోని 4వ స్పెషల్ జ్యూడిషియల్ కోర్టు మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతిరావు నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా జహంగీర్‌నగర్‌కు చెందిన సయ్యద్ జహీద్ (34) భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మరణాయుధాలతో సంచరిస్తూ దొంగతనానికి ప్రయత్నించేందుకు అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకొని నిందితునిపై కేసు నమోదు చేసుకొని మంగళవారం నాంపల్లిలోని 4వ స్పెషల్ జ్యూడిషియల్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ నిందితునికి నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రాష్ట్ర పశు సంపద అభివృద్ధికి కృషి చేయాలి


పశు సంవర్ధక శాఖను సందర్శించిన ప్రిన్సిపల్ సెక్రటరీ సభ్యసాచి ఘోష్‌తో అధికారులు

విజయనగర్‌కాలనీ: గ్రామాలలో పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, ఫెర్టిలిటీ క్యాంప్స్ ద్వారా ఉత్తమ జాతి దూడలను పెంపొందించేందుకు కృషి చేయాలని పశు సంవర్ధక, పాడిపరిశ్రమ అభివృద్ధి, మత్స్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సభ్యసాచి ఘోష్ అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్‌ను సందర్శించి లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీకి సంబంధించిన బ్రీడింగ్ కార్యకలాపాలు, కేంద్ర ప్రయోజిత పథకాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పశు వైద్యులు పశు పోషకులకు సెక్స్‌సోర్టెడ్ సెమెన్‌పై అవగాహన కల్పించి, మేలు జాతి ఆడదూడలను పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మత్స్యక్యాంటీన్‌ను సందర్శించి, మత్స్య క్యాంటీన్ మాదిరిగానే మాంసం క్యాంటీన్‌ను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పశు గణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ మల్లీశ్వరీ, గొర్రెలు, మేకల పెంపకందారుల సమైక్య అధికారి డాక్టర్ బి.సుబ్బారాయుడుతో పాటు రాష్ట్ర వ్యాప్త జిల్లాల డీఎల్‌డీఏ కార్యనిర్వహణాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చార్మినార్‌లో మరో మూడు సబ్ స్టేషన్ల నిర్మాణం


ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీతో సమావేశమైన టీజీఎస్పీడీసీఎల్ అధికారులు

చార్మినార్: చార్మినార్ ఏడీఈ పరిధిలో మరో మూడు సబ్ స్టేషన్లను నిర్మించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని టీజీఎస్పీడీసీఎల్ సౌత్ సర్కిల్ ఎస్ఈ మోహన్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా చార్మినార్ ఏడీఈ పరిధిలోని మూడు ప్రాంతాలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. అనంతరం చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీతో సమావేశమై చర్చించడం జరిగిందన్నారు. మూడు సబ్ స్టేషన్లు నిర్మించడానికి సరైన ప్రభుత్వ స్థలం కోసం యునాని ఆసుపత్రి ప్రాంగణంతో పాటు సుల్తాన్ షాహీ ప్లే గ్రౌండ్, జహీరా నగర్‌లోని ప్లే గ్రౌండ్‌లను పరిశీలించామన్నారు. స్థల సేకరణ జరిగిన వెంటనే సబ్ స్టేషన్ల నిర్మాణం పనులను ప్రారంభిస్తామన్నారు. చార్మినార్ డీఈ లింగయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం పంజేషా లోని సబ్ సెక్షన్‌పై విద్యుత్ భారం అధికంగా ఉంటుందన్నారు. దీంతో అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని..దీనిని నివారించడం కోసం మరో మూడు సబ్ స్టేషన్లు నిర్మాణం పనులను చేపట్టనున్నామన్నారు. చార్మినార్ ఏడీఈ విజయ్ కుమార్, మొగల్‌పురా ఏఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీజే ఆర్థిక సాయంతో ఆరుగురు ఖైదీల విడుదల

బహదూర్‌పురా: శిక్షా కాలం ముగిసినప్పటికీ చంచల్‌గూడ, చర్లపల్లి జైళ్లలో మగ్గుతున్న ఆరుగురు ఖైదీలకు చట్టపరమైన, ఆర్థిక సాయం అందించి విడుదలకు ఏర్పాట్లు చేశామని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సలీముల్ హిందీ తెలిపారు. ఈ ఆరుగురు ఖైదీలు తమ తమ ప్రాంతాల్లోని కోర్టులకు హాజరై, తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకుని గౌరవప్రదంగా జీవించే అవకాశం ఉందన్నారు. ఎంపీజే సంస్థ గత కొన్ని సంవత్సరాలుగా చిన్నా చితకా నేరాలకు పాల్పడి కారాగారాల్లో మగ్గుతున్న వారికి అండగా నిలిచి, వారి దిద్దుబాటుకు ప్రయత్నిస్తుందన్నారు. తమ ద్వారా ఈ రకమైన సహాయం పొందగోరేవారు పురానీహవేలిలోని కార్యాలయంలో 040 -2450318, 9010320638 లో సంప్రదించవచ్చన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


పారిశుద్ధ్య కార్మికులతో దేవర వంశీ తదితరులు

గోల్కొండ: బస్తీలు, కాలనీలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య సిబ్బంది ఎనలేని కృషి చేస్తున్నారని బీజేవైఎం నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మంగళవారం కార్వాన్ గుడిమల్కాపూర్ ప్రధాన రహదారుల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. అంటురోగాలు ప్రబలుతున్న సమయంలో పారిశుద్ధ్య పనులు సవ్యంగా జరిగేలా చూస్తున్నామన్నారు. డీఓపీ లలితకుమారి, నాయకులు నామా యాదగిరి, ముకేష్ తదితరులున్నారు.

దళారులను ఆశ్రయించ వద్దు

దూద్‌బౌలి: కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం దళారులను ఆశ్రయించకుండా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని బహదూర్‌పురా నూతన డిప్యూటీ తహసీల్దార్ రమేష్ కుమార్ కోరారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ సందీప్ కుమార్ వికారాబాద్‌కు బదిలీ కాగా.. వికారాబాద్ మండల కార్యాలయంలో డీటీగా పని చేస్తున్న రమేష్ కుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

10, 11 తేదీల్లో మెగా జాబ్‌మేళా

అబిడ్స్: ఈ నెల 10, 11 తేదీలలో జేఎన్‌టీయూ మెగా జాబ్‌ఫెయిర్ నిర్వహిస్తున్నారు. జేఎన్‌టీయూ యూనివర్సిటీ హైదరాబాద్ పరావస్తు క్రియేటీవ్ ఫౌండేషన్, నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ యూనివర్సిటీలో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పరావస్తు మధుకర్ స్వామి తెలిపారు. కూకట్‌పల్లిలో జేఎన్‌టీయూలో నిర్వహించే జాబ్‌మేళాలలో దాదాపు పేరుగాంచిన 100 వివిధ కంపెనీలు పాల్గొంటున్నాయని వివరించారు. ఈ జాబ్‌మేళా ద్వారా దాదాపు 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఐటీ, ఐటీఎస్, మేనేజ్‌మెంట్, ఫార్మా, కోర్, బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, రిటేల్ సెక్టార్లలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఇతర వివరాలకు 81212 12873, 73373 73575లలో సంప్రదించాలని పరావస్తు మధుకర్ స్వామి సూచించారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి

నాంపల్లి: జూనియర్ కళాశాల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డి.ఒడ్డెన్న తెలిపారు. హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ..హైదరాబాద్ జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించే విధంగా క్రీడా అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. తెలంగాణ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.లక్ష్మయ్య మాట్లాడుతూ..ప్రభుత్వ, ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల్లో కూడా ఫిజికల్ డైరెక్టర్ నియామకాలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.జక్కయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఉమారావ్, మేరి మహేందర్ పాల్గొన్నారు.

ముగిసిన సామూహిక కంకుమార్చన



యాకుత్‌పురా: హరిబౌలీ గజానన వ్యాయామశాల మాతేశ్వరీ పోచమ్మ, మహంకాళి ఆలయంలో ఐదు మంగళవారాల పాటు నిర్వహించిన అమ్మవారి సామూహిక కుంకుమార్చన ముగిసింది. ఉదయం అమ్మవారిని శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి..అమ్మవారి శాంతి కల్యాణం చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో మహిళలు పెద్ద సంఖ్యంలో పాల్గొన్నారు. మాతేశ్వరీ పోచమ్మ, మహంకాళి ఆలయ కమిటీ సభ్యులు దినేష్, ప్రభునాథ్, ప్రకాష్, సుశీల్, మన్మోహన్, అజయ్, శ్రవణ్, గోపాల్‌యాదవ్, అభినవ్, వేదసాయి, శ్రీనివాస్, శైలేష్, అర్చకులు కన్నయ్య, రంగానాథ్, హరినారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్మశానవాటికకు రక్షణ జాలీ ఏర్పాటు


పనులను ప్రారంభిస్తున్న శ్యాంరావు ముదిరాజ్

చాంద్రాయణగుట్ట: నల్లవాగు హిందూ శ్మశాన వాటికలో అభివృద్ధి పనుల కోసం ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేయడం హర్షణీయమని గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ అన్నారు. స్థానిక బస్తీల ప్రజలు శ్మశాన వాటికలో వ్యర్థాలు పడేయకుండా అరికట్టేందుకు జాలీ ఏర్పాటు కోసం జీహెచ్ఎంసీ రూ.5 లక్షలను మంజూరు చేసింది. ఈ పనులను మంగళవారం ఆయన భాగ్యనగర్ బ్యాగరీ సంఘం అధ్యక్షుడు పేరోజీ సాయినాథ్‌తో కలిసి ప్రారంభించారు. బ్యాగరీ సంఘం నాయకులు సాయిలు, దీపక్, సన్నీ, చిన్న పాల్గొన్నారు.


రేషన్ బియ్యం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

బహదూర్‌పురా: రేషన్ బియ్యాన్ని నేరుగా అక్రమ వ్యాపారులకు అమ్ముతున్న వ్యక్తితో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఘటన బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బహదూర్‌పురా పోలీసులు, సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల వివరాల ప్రకారం..మీర్ మెహ్రాజ్ అలీ హాష్మీ హసన్‌నగర్‌లోని రేషన్‌షాపు నంబర్:190, ఎస్ఆర్ నంబర్:931 తన బంధువు అయిన శాస్త్రిపురానికి చెందిన సయ్యద్ రహ్మాన్ పేరుపై ఉన్న లైసెన్సు గల రేషన్ షాపు నిర్వహిస్తూ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. మీరు మెహ్రాజ్ అలీ హాష్మీ, హసన్‌నగర్‌కు చెందిన కాఫీ డే వ్యాపారితో చేతులు కలిపి రేషన్ షాపు నుంచే బియ్యాన్ని చాలా కాలం నుంచి అక్రమంగా విక్రయిస్తున్నాడు. దీంతో సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర సివిల్ సప్లై అధికారులతో పాటు బహదూర్‌పురా పోలీసులతో కలిసి దాడి నిర్వహించారు. మీర్ మెహ్రాజ్ అలీ హాష్మీతో పాటు సయ్యద్ హామీద్, సయ్యద్ షకీ హాష్మీ రేషన్ షాపు వర్కర్‌ను అదుపులోకి తీసుకుని 28 క్వింటాళ్ల బియ్యం, అశోక్ లైలాండ్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకున్నారు. రేషన్ షాపు లైసెన్స్ హోల్డర్ సయ్యద్ అతార్‌ఉర్ రహ్మాన్‌తో పాటు మతీన్ అనే అక్రమ వ్యాపారి పరారీలో ఉన్నారు.

వివాహితను వేధించిన వ్యక్తికి జైలు

సంతోష్‌నగర్: వివాహితను వేధింపులకు గురిచేసిన కేసులో ఓ వ్యక్తికి 3 రోజుల జైలు శిక్ష, రూ.50 జరిమానా పడింది. ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరామయ్య తెలిపిన వివరాల ప్రకారం..సంతోష్‌నగర్‌కు చెందిన మహ్మద్ సమీర్ (25) ఇటీవల ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వివాహితను వేధింపులకు గురి చేశాడు. దీనిపై బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సమీర్‌ను అరెస్ట్ చేసి మంగళవారం నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా నిందితునికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.50 జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

ధూల్‌పేట్‌లో గంజాయి స్వాధీనం



అబిడ్స్: ఆపరేషన్ ధూల్‌పేట్‌లో భాగంగా ధూల్‌పేట్‌లోని పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించి 1.128 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎక్సైజ్ సీనియర్ అధికారి అంజిరెడ్డి పర్యవేక్షణలో ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. రహీంపురా, గాంధీచౌక్, పురానాపూల్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 1.128 కిలోల గంజాయిని స్వాధీనపరచుకున్నట్లు వారు తెలిపారు. గంజాయి విక్రయాలు, కొనుగోళ్లు పూర్తిగా నిషేధించాలని ఎక్సైజ్ పోలీసులు ప్రతిరోజూ ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు.